59 కేజీల బంగారం చోరీపై కొనసాగుతున్న దర్యాప్తు

బెంగళూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): విజయపుర జిల్లా బసవనబాగేవాడి మనగూళి కెనరాబ్యాంకులో చోరీ అయిన బంగారం కోసం పోలీసులు ప్రత్యేక బృందాల ద్వారా గాలింపు జరుపుతున్నట్లు జిల్లా ఎస్పీ లక్ష్మణ నింబరగి తెలిపారు. సోమవారం మీడియాతో మాట్లాడిన ఎస్పీ మే నెల 23 నుంచి 25వరకు బ్యాంకుకు సెలవుల కారణంగా దొంగలు చోరీకి పాల్పడ్డారన్నారు. 26న బ్యాంకు సీనియర్ మేనేజర్ కల్మేశ్ పూజారి ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. 59కేజీల బంగారం, 5.20 లక్షల నగదు చోరీ జరిగిందన్నారు. 8 బృందాల ద్వారా గాలింపు చేపట్టామన్నారు.




బుకర్ ప్రైజ్ గ్రహీత బానుముస్తాక్, అనువాదకురాలు దీపా భస్తిని సత్కరిస్తున్న సీఎం, మంత్రులు

సమాజాన్ని ఐక్యం చేసే శక్తి

సాహిత్యానిదే..!

- బుకర్ ప్రైజ్‌తో కన్నడ ఖ్యాతిని ప్రపంచానికి చాటారు
- బాను ముస్తాక్, దీపా బాస్తికి రూ.10లక్షల ప్రోత్సాహకం
- రచనల అనువాదానికి సర్కారు సాయం: సీఎం

బెంగళూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): సమాజాన్ని ఐక్యం చేసే శక్తి సాహిత్యానికే ఉందని, సాహితీవేత్తలు ఆ దిశగానే రచనలు సాగించాలని సీఎం సిద్దరామయ్య అన్నారు. కన్నడ సంస్కృతిశాఖ సోమవారం విధానసౌధ బ్యాంకెట్‌హాల్‌లో బుకర్ ప్రైజ్ విజేత బాను ముస్తాక్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అనువాదకురాలు దీపా బాస్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ బాను ముస్తాక్ బుకర్ ప్రైజ్ సాధించడం ద్వారా కన్నడ కీర్తిని ప్రపంచానికి చాటారన్నారు. కన్నడను ప్రపంచం చూసేలా చేశారని కొనియాడారు. రచనల ద్వారా బాను ముస్తాక్, అనువాదం ద్వారా దీపా బాస్తిల విజయాలు రాష్ట్రానికి ఎంతో పేరు తెచ్చాయన్నారు. ఒక్కొక్కరికి రూ.10లక్షల రూపాయలు ప్రభుత్వం ప్రోత్సాహకం అందజేయనున్నట్లు ప్రకటించారు. పాత్రికేయురాలిగా, రచయితగా, న్యాయవాదిగా, పోరాటనేతగా సమాజంలో గుర్తింపు పొందిన బాను ముస్తాక్ రచనలే ఆమె శక్తి అన్నారు. లంకేశ్ పత్రికలో పనిచేస్తూనే న్యాయవాదిగా పేదల కేసులను వాదించేవారన్నారు. రాజ్యోత్సవంతో పాటు పలు పురస్కారాలు ఆమె సమాజ చైతన్యం కోసం దక్కాయన్నారు. ముస్లిం సామాజికవర్గంలో మహిళల ధ్వనిగా, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రగతిపరమైన ఆలోచనలు బాను ముస్తాక్‌లో ఉన్నాయన్నారు. సాహిత్యం ద్వారా మానవత్వ సందేశాన్ని ఇచ్చే బాధ్యత బాను ముస్తాక్ నిర్వహించాలన్నారు. కవి రాజమార్గంలో పర మతం, పర విచారాలు, సానుభూతితో చూడాలన్నారు. కార్యక్రమంలో డీసీఎం డీకే శివకుమార్, విధానపరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి, కన్నడ సంస్కృతిశాఖ మంత్రి శివరాజ్ తంగడగి, మంత్రి జమీర్ అహ్మద్, ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్, కన్నడ అభివృద్ధి ప్రాధికార అధ్యక్షుడు పురుషోత్తమ బిళిమలెలు పాల్గొన్నారు.



భద్రతపై ఆరా..!

- పశ్చిమ కనుమల్లో మరోసారి సర్వే
- భూమి కుంగడంపై ఆందోళన
- పాత సూచనలకు మంగళం
- 3 నెలల్లో నివేదికకు మంత్రి ఖండ్రే ఆదేశం

బెంగళూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విస్తారంగా ఉండే పశ్చిమ కనుమలకు అనుబంధమైన తాలూకాల్లో భూమి కుంగిపోయే ప్రమాదాలపై మరోసారి సమగ్ర సర్వే జరిపేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే పశ్చిమకనుమల్లో ఓ సారి సర్వే జరిగింది. నివేదికకు అనుగుణంగా నిబంధనలు పాటించడం కష్టతరంగా మారింది. దీంతో పాత నివేదికకు స్వస్తి పలికి లోతైన అధ్యయనం జరిపించేందుకు సర్కారు సిద్ధమైంది. పశ్చిమ కనుమల ఘాట్‌ల సామర్థ్యాన్ని పరిశీలించి మూడు నెలల్లోగా నివేదిక సమర్పించాలని అటవీశాఖ ముఖ్య అధికారికి అటవీ పర్యావరణశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె సూచించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. రాష్ట్రంలో కొన్నేళ్లుగా వర్షాకాలంలో తీర ప్రాంతం, మలెనాడు ప్రదేశంలో భూమి కుంచించుకుపోవడం, మట్టి చరియలు విరిగిపడడం వంటి ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. గత ఏడాది ఉత్తరకన్నడ జిల్లా శిరూరుగుట్ట కుంగిపోవడంతో పెను ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఏకంగా లారీలు గల్లంతు కావడం, డ్రైవర్‌తోపాటు మరికొందరు మృత్యువాత చెందిన విషయం తెలిసిందే. ఇక హాసన్, చిక్కమగళూరు, దక్షిణకన్నడ జిల్లాలో భూమి కుంచించుకుపోయే ప్రమాదాలు నిరంతరంగా సాగుతూనే ఉన్నాయి.

జీవ వైవిధ్యానికి నిలయం పశ్చిమ కనుమలు...



విరిగిపడిన మట్టిచరియ (ఫైల్)

రాష్ట్రంలోని అటవీప్రాంతాల్లో 60శాతం జీవవైవిధ్యానికి అనుబంధమైన వృక్షసంపద పశ్చిమ కనుమల్లోనే ఉంది. ఈ ప్రాంతం మొక్కలు, వన్యప్రాణులు, కీటకాలు, పక్షుల కేంద్రంగా ఉంది. విస్తారమైన అటవీప్రాంతాలకు కర్ణాటక, కేరళ, మహారాష్ట్రలో ప్రకృతి, పర్యావరణం, వాతావరణం అనుకూలానికి పశ్చిమకనుమలే కీలకమైన కేంద్రాలుగా ఉన్నాయి. పశ్చిమ కనుమల ప్రదేశంలోనే రోడ్ల ఏర్పాటు, ఇతరత్రా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. తద్వారా పశ్చిమకనుమల ప్రదేశాలు ప్రమాదానికి కారణమవుతున్నాయి. జీవహాని, ఆస్తులకు నష్టం, పంటలనష్టం జరుగుతోంది. పశ్చిమకనుమలపై నిరంతరంగా సాగుతున్న దాడి ఇప్పటికే పలు ప్రమాదాలకు సంకేతమైందని, భవిష్యత్తులో కర్ణాటక వ్యాప్తంగా జలక్షామం ఏర్పడే అవకాశాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు, పర్యావరణ నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



3 నెలల్లో పూర్తి నివేదిక ఇవ్వాలి: మంత్రి ఖండ్రే

రాష్ట్రప్రభుత్వం పశ్చిమ కనుమల్లో కొండగుట్టల సామర్థ్యంపై అధ్యయనం చేసి మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలని మంత్రి ఈశ్వర్‌ఖండ్రె సూచించారు. పశ్చిమ కనుమల్లో భూమి కుంగిపోయే ప్రమాదం ఉందని, దాన్ని అరికట్టాలనేది అటవీశాఖ మంత్రి ఆశయంగా ఉంది. అయితే 2012లోనే ఒకసారి అధ్యయనం జరిగింది. పశ్చిమకనుమల సంరక్షణ వంటి అంశాన్ని ప్రభుత్వం అత్యవసరమైన చర్యగా భావించాలని పర్యావరణ నిపుణులు అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైంది. ఇప్పటికే భూమి కుంగిపోయే సంఘటనలు తరచూ కొనసాగుతున్నాయి. చిక్కమగళూరు, హాసన్, దక్షిణకన్నడ జిల్లాల్లో మట్టి చరియలు విరిగిపడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈసారి వర్షాకాలం ప్రారంభానికి ముందే విస్తారంగా వానలు కురుస్తున్నాయి. ఇప్పటికే నెలన్నరకాలంగా విస్తారంగా వర్షాలు పశ్చిమకనుమలు, తీరప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు ప్రారంభం అవుతున్న తరుణంలో నిపుణుల అధ్యయనం సాధ్యమయ్యేనా..? అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. రాష్ట్రంలోని పశ్చిమ కనుమలపై కస్తూరిరంగన్ నివేదికను సమర్పించారు. పశ్చిమకనుమలకు అనుబంధంగా ఉండే గ్రామాల ప్రజలు ఆక్రమించుకుని అభివృద్ధి చేశారు. కొందరు ఇళ్లు నిర్మించుకోగా మరికొందరు పంట పొలాలుగా మార్చుకున్నారు. ఇలా పశ్చిమకనుమల్లో లక్షలాది ఎకరాలు ఆక్రమణలకు గురయ్యాయని, వాటన్నింటినీ బఫర్‌జోన్‌గా మార్చాలని నివేదికలో సూచించారు. ప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడి రావడంతో అమలు చేయలేకపోయారు.

నాలుగేళ్ల కిందటే అధ్యయనం

2021లో ప్రభుత్వం అటవీశాఖ ద్వారా నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. భూమి కుంగిపోయే ప్రాంతాలపై సమగ్ర అధ్యయనం చేయాలని ఆదేశించింది. రాష్ట్రంలోని పశ్చిమ కనుమలు, తీరప్రాంత జిల్లాల్లో భూమి కుంచించుకుపోవడాన్ని నియంత్రించే మార్గదర్శకాల పేరిట అధ్యయన కమిటీ నిపుణులు ఓ నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. ఇందులో శాస్త్రవేత్తలు ఐఐఎస్‌సీ నిపుణులతో కూడిన బృందం వివిధ జిల్లాల్లో పర్యటించింది. పలు మార్గదర్శకాలను నివేదిక ద్వారా పొందుపరిచింది. వాటికి అనుగుణంగా దక్షిణకన్నడ, ఉడుపి, ఉత్తరకన్నడ, శివమొగ్గ, చిక్కమగళూరు, కొడగు, హాసన్ జిల్లాల్లోని 23 తాలూకాల పరిధిలో భూమి కుంగిపోయే ప్రమాదం ఉందని 2021లో నిపుణులు సమర్పించిన నివేదికలో స్పష్టం చేశారు. 23 తాలూకాల్లో 2,621 గ్రామాల్లో 7.74 లక్షల ఇళ్లకు హాని జరిగే అవకాశం ఉందని పొందుపరిచారు. 34.14లక్షలమందికి సమస్య ఏర్పడవచ్చునని భూమి కుంగిపోయే ప్రాంతాలను గుర్తించి వాటిని అరికట్టడమే తగిన పరిష్కారమని సిఫారసులో పొందుపరిచారు.

తరచూ కుంగిపోతున్న భూములు

పశ్చిమ కనుమల్లో కొండగుట్టల సామర్థ్యాన్ని పరిశీలించి పరిష్కార మార్గాలను నిర్ధారించేందుకే సర్వే జరిపించాలని నిర్ణయించారు. ఏటా వర్షాకాలంలో కొండ చరియలు విరిగిపడడం, మట్టి కుంగిపోయే ప్రమాదాలు జరిగినప్పుడు శాశ్వతమైన విధానాలు తీసుకురావాలని చర్చించినా ఆ తర్వాత వదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.



రాళ్లు తేలిన రహదారిపైనే వెళ్తున్న లారీలు

నిధులున్నా మారని ఘనులు..!

- మైనింగ్ రవాణాతో దెబ్బతింటున్న రహదారులు
- రాళ్లు తేలుతున్నా తీరు మార్చుకోని కాంట్రాక్టర్లు
- ప్రత్యేక కారిడార్ లేక నిత్యం ప్రమాదాలు

బళ్లారి గాంధీనగర్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కర్ణాటక గనుల పరసరాల పునశ్చేతన మండలి(కేఎంఈఆర్‌సీ)లో వేలాది కోట్ల రూపాయల నిధులు ఉన్నా మైనింగ్ రవాణాకు వాహనాలకు ప్రత్యేక కారిడార్‌ను నిర్మించడంలో ప్రజాపనుల శాఖ నిర్లక్ష్యం వహిస్తోంది. బళ్లారి జిల్లా పరిధిలోని సండూరు తాలూకాలో ప్రతి రోజూ 11వేల మైనింగ్ లారీలు సంచరిస్తుంటాయి. వార్షికంగా లక్షలాది టన్నుల ఇనుప ఖనిజం భారీ ప్రమాణంలో లారీల ద్వారా రవాణా అవుతుంటోంది. ప్రభుత్వం మాత్రం ఇనుప ఖనిజం తీసుకెళ్ళే లారీలకు ప్రత్యేక కారిడార్ లేకపోవడం, మైనింగ్ రవాణా పరిమితిని నియంత్రక పోవడంతో రోడ్లు పూర్తిస్థాయిలో దెబ్బతిని నిత్యం ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్నాయి. గనుల పీడిత ప్రాంతాలైన దామఘడ, నారాయణపుర గ్రామాల నుంచి యు.రాజాపుర గ్రామానికి వెళ్ళే రోడ్డు, కమ్మత్తూరు(దేవగిరి హళ్ళి) గ్రామాల నుంచి సోమనహళ్ళి, తోణసిగేరి, నరసింగాపుర గ్రామాలను కలిపే రోడ్లలో మైనింగ్ లారీలు సంచరిస్తుండడంతో రోడ్లు అన్ని గుంతల మయం అయ్యాయి. ప్రజా పనుల శాఖ రవాణాకు అవసరమైన రోడ్లు నిర్మించక కాలయాపన చేస్తున్నట్లు స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. సుశీలనగర గ్రామం నుంచి ప్రాచీన, రామఘడ గ్రామానికి వెళ్ళే రోడ్డు ప్రజా పనుల శాఖ గతంలో ఎపుడో నిర్మించిన గనుల కంపెనీల కారణంగా విచ్ఛిన్నమైంది.



దుమ్ము, ధూళితో పాడవుతున్న పంట పొలాలు

ఈ గ్రామాల ప్రజలు అంతా ప్రస్తుతం రామఘడ గ్రామస్తులు సిద్దాపుర గ్రామం ద్వారా లారీలు ప్రయాణించే దారిపైనా ఆధారపడ్డారు. రామఘడ గ్రామానికి నూతన రోడ్డు అభివృద్ధికి కేంఎఈఆర్‌సీ నుంచి ప్రజా పనుల శాఖకు రూ.79కోట్ల రూపాయలు కేటాయించింది. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలంటే సండూరు నియోజకవర్గం ప్రజా ప్రతినిధులు, అధికారుల ఇచ్ఛా శక్తి కొరవడిందని చెప్పవచ్చు. మైనింగ్ లారీలు నిరంతరం సంచరిస్తుండడంతో రోడ్లు గుంతల మయంగా మారాయి. అధ్వాన స్థితిలో ఉన్న రోడ్డుపై మైనింగ్ లారీలు తిరగడం ద్వారా అధిక దుమ్ము, ధూళి కారణంగా క్షయ రోగం లాంటి ఊపిరి సంబంధిత శ్వాసకోస సమస్యలు, హృదయ సంబంధిత వ్యాధులకు స్థానికులు గురి అవుతున్నారు. ఎర్రటి దుమ్ము ధూళి కారణంగా రోడ్డు ప్రక్కన ఉన్న పొలాల్లో పంటల దిగుబడి తగ్గిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తమకు జరుగుతున్న పంట నష్టం గురించి ఎవరికి తెలపాలో అర్థం కాక రైతులు లబోదిబో అంటున్నారు. గని బాధిత ప్రాంతాల్లో కేఎంఈఆర్‌సీ నిధుల ద్వారా సీసీ రోడ్లు నిర్మించాలని గనుల బాధిత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



కేఎంఎఫ్‌లో పాల లోడ్‌తో ఆగిన ట్యాంకర్

అన్నీ లోపాలే..!

- రాష్ట్రవ్యాప్తంగా పెరిగిన పాల ఉత్పత్తి
- పడిపోయిన అమ్మకాలు
- నిల్వ సామర్థ్యం, శీతల గోడౌన్లపై దృష్టిపెట్టని కేఎంఎఫ్ అధికారులు
- అన్‌లోడ్ కాక వేల లీటర్లు ట్యాంకర్లలోనే..

బళ్లారి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పుష్కలంగా పాలున్నా నిల్వ చేసుకోలేని దుస్థితి ఏర్పడింది. నిల్వ చేసుకోవడానికి శీతల గిడ్డంగులు లేక ట్యాంకర్లలో పాలను లోడ్ చేయకుండా నిలిపేస్తున్నారు. నిర్వహణ లోపం కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందని విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో పాల ఉత్పత్తి జోరందుకుంది. అంచనా కన్నా కేఎంఎఫ్‌కు పాడి రైతుల నుంచి అధికంగా పాలు వస్తున్నాయి. ముందస్తు వానలు కురవడం, అడవిలో పచ్చిగడ్డి విరివిగా దొరకుతుండంతో పశువులు పాలు పుష్కలంగా ఇస్తున్నాయి. పైగా వాతావరణం కూడా చల్లబడడం తో ప్రజలు మజ్జిగ, పెరుగు వాడకం తగ్గించారు. దీనితో ఉత్పత్తి పెరిగి వాడకం తగ్గడంతో కేఎంఎఫ్ అధికారులు రోజూ మిగులుతున్న పాలను పౌడరుగా మారుస్తున్నారు. కొన్ని కేంద్రాల్లో అన్‌లోడ్ కాక రోజంతా నిలబడి పోతున్నాయి.

● రాష్ట్రంలో మొత్తం 15 ప్రాంతాల్లో కర్ణాటక మిల్క్ ప్రొడక్షన్ కార్యాలయాలు ఉన్నాయి. బళ్లారి జిల్లా లో ఒక కేంద్ర, బళ్లారి, రాయచూరు, కొప్పళ, విజయనగర జిల్లాలు కలిపి బళ్లారి లో కేఎంఎఫ్ కార్యాలయం ఉంది. బళ్లారి కేఎంఎఫ్‌కు రోజూ 2,28,458 లీటర్లు పాలు రైతుల నుంచి వస్తున్నాయి. ఇందులో రోజూ 1,38,458 లీటర్ల పాలు అమ్ముడుపోయి 90,000 లీటర్ల పాలు మిగిలిపోతున్నాయి. మిగిలిన పాలను పౌడరుగా మారుస్తామని మేనేజింగ్ డైరెక్టర్ తెలిపారు. బళ్లారి కేఎంఎఫ్ నుంచి బెంగళూరు కేఎంఎఫ్‌కు పాలు ట్యాంకర్ల పంపినా అక్కడ పాలు నిల్వలకు అవకాశం లేక ట్యాంకర్ల రోజుల కొద్ది అన్‌లోడ్ కాక నిలబడి పోతున్నాయి. దీంతో సరైన సమయంలో అన్‌లోడ్ కాకపోవడంతో అవి పాడవుతున్నాయి. పక్కరాష్ట్రం అయిన ఆంధ్రప్రదేశ్‌లో కూడా పాల ఉత్పత్తి పెరడంతో నంది పాల కొనుగోళ్లపై ఆసక్తి చూపడం లేదు. గతంలో నందిపాలు తిరుపతి, విజయవాడ తదితర ప్రాంతాలకు సరఫరా చేసేవారు. కానీ అక్కడ కూడా నంది పాల కొనుగోళ్ల నిలిపివేశారు.

● అయితే ఉత్పత్తి అధికంగా ఉన్నా పాల నిల్వలకు చర్యలు తీసుకోకపోవడం, సరిపడిన శీతల కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో పాలు పాడయిపోతున్నాయి. వేసవిలో తీవ్ర ఇబ్బందులు పడ్డా అధికారుల్లో మార్పు రాలేదు. చాలా కేంద్రాల్లో పాలు మిగిలిపోతున్నాయి. అధికారులు తగిన చర్యలు తీసుకుని పాలను నిల్వ చేయాలని పాడి రైతులు కోరుతున్నారు.

ప్రాచీన కట్టడాలు..!

- హంపి స్మారకాల మధ్య నిలిచిపోయిన వాననీరు
- కంపు కొడుతున్నా పట్టించుకోని పురావస్తు అధికారులు

కంప్లి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రాచీన కట్టడాలు పాచి పట్టిపోతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు స్మారకాల మధ్య వాననీరు నిలిచి కంపు కొడుతున్నా పురావస్తు శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన హంపిలో స్మారక చిహ్నాల దగ్గర నీరు నిలవడంతో పర్యాటకులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వేసవి సెలవులు కావడంతో దేశ పర్యాటుకులు సైతం అధికంగా వస్తున్నారు. నీటిని తొలగించేందుకు అధికారులు ముందుకు రావడం లేదు. విరుపాక్షేశ్వర దేవస్థానం ఎదురు భాగంలో రెండు వైపులా మండపాల వద్ద ఎక్కడ చూసినా నీరు నిలిచిపోయింది. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకుని నీటిని తొలగించాలని పర్యాటకులు కోరుతున్నారు.



మండపాల వద్ద నిలిచిపోయిన వర్షపునీరు



అందరి చూపు.. రాయల్ వైపు..!

- నేడు ఐపీఎల్ ఫైనల్స్
- 9 ఏళ్ల తర్వాత తలపడనున్న బెంగళూరు
- హోటళ్లు, రెస్టారెంట్లలో భారీ స్క్రీన్ల ఏర్పాటు

7

కదంతొక్కిన కర్షకులు..!

- జొన్న కొనుగోలులో నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం
- సింధనూరు బంద్ విజయవంతం



సింధనూరులో ఆందోళన చేస్తున్న రైతులు

జేఈఈలో సత్తాచాటిన

నారాయణ విద్యార్థి

బెంగళూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో బెంగళూరు సహకారనగర్ నారాయణ విద్యాసంస్థల సిందూర బ్రాంచ్ విద్యార్థి చైతన్మ పరమశివం 88వ ర్యాంకును సాధించారు. జేఈఈ పరీక్షల్లో వెయ్యి లోపు 14మంది ర్యాంకులు సాధించినట్లు సిందూర డైరెక్టర్ అండ్ డీన్ బీవీ నాగరాజు సోమవారం మీడియాకు తెలిపారు. ఉత్తమర్యాంకులు సాధించిన విద్యార్థులను పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.



చైతన్య పరమశివంను అభినందిస్తున్న డీన్ నాగరాజు

కన్నడిగులకు కమల్ హాసన్

క్షమాపణ చెప్పాలి

8





"ఆగు హనుమా..!
నీ తల్లి సీతమ్మ పిలుస్తోంది..
అక్కడో అభాగ్యుడు
చింతాక్రాంతుడై కూర్చున్నాడు..
అలా పట్టించుకోకుండా వెళతావేం..?"

"అతనున్నది కలియుగం..
కూర్చున్న చోటు ద్వాపరయుగం..
మనదేమో త్రేతాయుగం..
వాళ్ల కలెక్టర్ గుత్తికి వెళ్లాడు..
వచ్చాక చూసుకుంటాడులే రామచంద్రా.."

గోడు

గోడపై రథమున్నది.. కృష్ణార్జునులు లేరు..!
యుద్ధాలను మాకు వదిలేసి
ఎటో వెళ్లిపోయారు.. అధికారుల్లాగా.. ప్చ్..!

బ్రహ్మసముద్రం మండల కేంద్రానికి చెందిన ఈ పెద్దాయన పేరు గన్నప్ప. కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల వేదిక ఉంటుందని భావించి సోమవారం వచ్చాడు. కానీ గుత్తిలో ఉండటంతో కలెక్టర్ సహా అధికారులు అందరూ అక్కడికి వెళ్లారు. 'ఇల్లు అమ్ముకున్నాను. సమస్య ఉంది. కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చాను..' అని దిగులుగా చెప్పాడు. తెలియక జిల్లా కేంద్రానికి వచ్చే ఇలాంటివారికోసం ఒక అధికారిని ఇక్కడే ఉంచితే బాగుంటుంది. కలెక్టర్ ఆ దిశగా ఆలోచించాల్సిన అవసరం ఉంది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

రేషన్ పంపిణీలో 'అనంత'కు

మూడో స్థానం



రేషన్ సరుకులు తీసుకుంటున్న లబ్ధిదారులు

అనంతపురం టౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపు వద్దే సరుకులు తీసుకోవడానికి లబ్ధిదారులు మొగ్గు చూపుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. గత టీడీపీ పాలనలో అమలు చేసిన ఈ విధానాన్ని ఆదివారం నుంచి మళ్లీ ప్రారంభించారు. జిల్లాలో 1645 రేషన్‌షాపులలో సరుకుల పంపిణీకి యంత్రాంగం చర్యలు తీసుకుంది. అధికారుల లెక్కట ప్రకారం జిల్లాలో 6,66,300 రేషన్ కార్డులు ఉన్నాయి. రెండు రోజుల్లో 2,22,732 మంది కార్డుదారులు రేషన్ సరుకులు తెచ్చుకున్నారు. సరుకుల పంపిణీలో రాష్ట్రంలో అనంత జిల్లా మూడోస్థానంలో నిలిచినట్లు రాష్ట్రశాఖ వెబ్‌సైట్‌లో ఉంచారు.

అందరికీ సరుకులు: జేసీ

డీలర్ల నుంచి కార్డుదారులందరికీ రేషన్ సరుకులు అందిస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని జాయింట్‌కలెక్టరు శివనారాయణశర్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 8గంటల వరకు డీలర్‌షాపులు తెరిచి ఉంటాయన్నారు. 15రోజులు పాటు సరకులు పంపిణీ చేస్తారన్నారు. జిల్లావ్యాప్తంగా 58,390మంది కార్డుదారులు 65సంవత్సలుపైబడినవారు, దివ్యాంగులు ఉన్నారన్నారు. వీరందరికి ఇళ్లవద్దకే వెళ్లి డీలర్లు సరకులు ఇవ్వాలని జేసీ ఆదేశించారు.

కదిరిలో భారీ చోరీ

- పది తులాల బంగారం, నాలుగు కిలోల వెండి అపహరణ

కదిరి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దత్తానగర్‌లో నివాసం ఉండే తెలుగు అధ్యాపకులు కవిత నివాసంలో భారీ చోరీ జరిగినట్లు సోమవారం ఫిర్యాదు అందిందని సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ఆదివారం రాత్రి 11.30వరకు కుటుంబ సభ్యులందరూ కలిసి మాట్లాడుకున్నారు. తరువాత బెడ్ రూమ్‌లో నిద్రపోయారు. దొంగలు వారు నిద్రిస్తున్న బెడ్ రూమ్‌కాకుండా మరో బెడ్‌రూమ్‌కున్న గ్రీల్ కట్ చేసి, లోపలికి వెళ్లారు. బీరువాలను పగలకొట్టి పది తులాల బంగారం, నాలుగు కిలోల వెండివస్తులు, దాదాపు రూ.లక్ష నగదు చోరీ చేసినట్లు బాధితులు ఫిర్యాదు చేశారన్నారు. క్లూస్ టీమ్ చోరీ జరిగిన ఇంటిని పరిశీలించినట్లు చెప్పారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకుల పంట

- జిల్లా విద్యార్థులకు ఆలిండియా స్థాయి ర్యాంకులు
- ఆకులేటి చందనకు 81,
- నితిన్ అగ్నిహోత్రికి 183వ ర్యాంకు
- ఓపెన్ కేటగిరీలో పలువురి సత్తా







81వ ర్యాంకు పొందిన ఆకులేటి చందన , 183వ ర్యాంకు సాధించిన భూపతి నితిన్ అగ్నిహోత్రి , ఉపాధ్యాయ దంపతుల కుమారుడు హార్తిక్‌రెడ్డి

అనంతపురం విద్య, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్స్(జేఈఈ) అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జిల్లాకు ర్యాంకుల పంట పండింది. ఆలిండియా స్థాయిలో ఓపెన్ కేటగిరీలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. సోమవారం జేఈఈ అడ్వాన్స్ ఫలితాలు విడుదలయ్యాయి. జిల్లాకు చెందిన ఆకులేటి చందన ఆలిండియా 81వ ర్యాంకు, భూపతి అగ్నిహోత్రి 360 మార్కులకు 264 మార్కులతో 183వ ర్యాంకు సాధించాడు. పలువురు విద్యార్థులు ఓపెన్ కేటగిరీలో ఐదు వేల లోపు ర్యాంకులు సాధించారు.

నారాయణ విద్యార్థుల సత్తా

జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. టాప్ ర్యాంకులు పొందిన విద్యార్థులను నారాయణ విద్యాసంస్థల కోర్ డీన్ బద్రీనాథ్, డీజీఎం వెంకట్రామిరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా బద్రీనాథ్ మాట్లాడుతూ.. విద్యార్థి భూపతి నితిన్ అగ్నిహోత్రి 183వ ర్యాంకు సాధించి జిల్లాకే గర్వకారణంగా నిలిచాడని కొనియాడారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో విద్యార్థులు విశాల్ 3,946వ ర్యాంకు, భావన 10,899వ ర్యాంకు, మోక్షసాయిరెడ్డి 12,809వ ర్యాంకు, మహమ్మద్‌ఆసిఫ్ 16,099వ ర్యాంకు, సవిత్‌కుమార్‌రావు 16,884వ ర్యాంకు సాధించారని తెలిపారు. లోకేష్‌కుమార్ 114 ర్యాంకు (ఎస్సీ కేటగిరి), ప్రణయ్‌చౌదరి 5,499(ఈడబ్ల్యూఎస్) ర్యాంకు సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఐఐటీల్లో ఇంజనీరింగ్ సీట్లు తప్పనిసరిగా వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు రవిశంకర్, ఓబన్నగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న నారాయణ కళాశాల కోర్ డీన్ బద్రినాథ్, సిబ్బంది

తేజ విద్యార్థికి 81వ ర్యాంకు

తేజ జూనియర్ కాలేజ్‌లో చదివిన ఆకులేటి చందన 81వ ర్యాంకు సాధించడంతో డైరెక్టర్ తేజేశ్వర్‌రెడ్డి, చైర్‌పర్సన్ ఉమాదేవి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చందన 10వ తరగతిలో 560 మార్కులు సాధించిందన్నారు. తేజ కాలేజ్‌లో ఉచితంగా కోచింగ్ ఇచ్చామన్నారు. అధ్యాపకులు ఇచ్చిన బోధనాంశాలు, సూచనలు, సలహాలు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. జాతీయ స్థాయిలో సత్తా చాటడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్లు అనిల్ కుమార్, సాయి చైతన్య, నేత్రా, వాణీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ దంపతుల కుమారుడికి 4,363 ర్యాంకు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఉపాధ్యాయ దంపతుల కుమారుడు హార్తిక్‌రెడ్డి 4,363 ర్యాంకు పొందాడు. తల్లిదండ్రులు సూర్యప్రకాష్‌రెడ్డి, రామభారతి ఎస్‌జీ టీచర్లు. 1 నుంచి 10 వరకూ అనంతపురం, ఇంటర్ విజయవాడలోని శ్రీచైతన్యలో చదివాడు. కొడుకు పందిరిపల్లి హార్తికొరెడ్డి జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

18.86 టీఎంసీలు..

తుంగభద్ర డ్యాంలో పెరుగుతున్న నీటి నిల్వ

20 వేల క్యూసెక్కులకుపైగా ఇన్‌ఫ్లో



తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్, జూన్2(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ పెరుగుతూ వస్తోంది. సోమవారానికి 18.86 టీఎంసీలకు చేరింది. జలాశయం పరీవాహక ప్రాంతంలో వర్షాలు బాగా కురుస్తుండడంతో ఇన్‌ఫ్లో భారీగా చేరుతోంది. సోమవారం 20 వేల క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో రావడంతో నీటి నిల్వ 18.86 టీఎంసీలకు చేరింది. ప్రస్తుతం జలాశయ నీటిమట్టం 1597.84 అడుగులుగా నమోదైంది. గతేడాది ఇదే సమయానికి జలాశయ నీటిమట్టం 1577.47 అడుగులు ఉండగా.. 3.360 టీఎంసీల నీటి నిల్వ నమోదైంది. ఈ ఏడాది జలాశయానికి ముందస్తుగా వరద వస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బ్రిటీషర్లను ఎదిరించిన యోధుడు వడ్డే ఓబన్న

పరిటాల శ్రీరామ్

ధర్మవరం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీషర్లను ఎదిరించిన యోధుడు వడ్డే ఓబన్న అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. స్థానిక పుట్టపర్తి రహదారిలోని సిరికల్చర్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన వడ్డే ఓబన్న విగ్రహాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వడ్డే అంజినప్ప, జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డితో కలిసి శ్రీరామ్ సోమవారం ఆవిష్కరించారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రజలతో కలిసి వడ్డే ఓబన్న పోరాటం చేశారన్నారు. సూర్యచంద్రులు ఉన్నంతకాలం ప్రజల హృదయాల్లో వడ్డే ఓబన్న ఉంటారన్నారు. చదువులు లేకుండానే నగరాలను నిర్మించిన ఘనత వడ్డెర్లకే దక్కుతుందని కొనియాడారు. హక్కుల సాధన కోసం వడ్డెర్లు వేసే ప్రతి అడుగులో పరిటాల కుటుంబం అండగా ఉంటుందని శ్రీరామ్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీశ్‌బాబు, వడ్డెర సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డె వెంకట్, వడ్డెర సంఘం ధర్మవరం అధ్యక్షులు డేరంగుల అంజి, నాయకులు పల్లపు రవీంద్ర, మంజుల నరేంద్ర, తోపుదుర్తి వెంకటరాముడు పాల్గొన్నారు.



వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పరిటాల శ్రీరామ్, వడ్డే అంజినప్ప, చిలకం మధు

పుట్టపర్తిలో మోసగాళ్లు

పుట్టపర్తిటౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో కొందరు మాయగాళ్లు విదేశీయులను, ఎన్ఆర్ఐలను మోసం చేస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. సత్యసాయి భక్తుల ముసుగులో విదేశీయులను నమ్మించి, బుట్టలో వేసుకుని తమపేర్లతో భారీగా ఆస్తులు సంపాదించుకుంటున్నారు. ఆపై అడ్డగోలు వ్యవహారాలు నడిపి విదేశీయులను ముంచేస్తున్నారు. అమెరికాకు చెందిన ఓ మహిళను పుట్టపర్తికి చెందిన సత్యనారాయణ రాజు అనే వ్యక్తి రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో మోసం చేసి రూ.12.5కోట్లు తీసుకుని మోసం చేశాడనే అభియోగంపై ఇటీవల పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఇలాంటి సంఘటనలు అప్పుడప్పుడు ఒకటిరెండు బయటపడుతున్నాయి. కానీ చలామంది మాయగాళ్లు చాపకింద నీరులా తమ పని చక్కపెట్టుకుంటూ పుట్టపర్తి ప్రతిష్టను దెబ్బతీస్తున్నారు.

నమ్మకమే పెట్టుబడి

విదేశీయుల నమ్మకమే పుట్టపర్తిలోని మాయాగాళ్లకు పెట్టుబడిగా మారింది. అనేక సంవత్సరాల నుంచి సత్యసాయిబాబా దర్శనార్థం పుట్టపర్తికి వచ్చిన విదేశీ భక్తులు, ఎన్ఆర్ఐలకు ఈమోసగాళ్లు సహాయకులుగా దగ్గరై చిన్నచిన్న పనులు చేస్తూ వారిని నమ్మిస్తారు. ఆతరువాత విదేశీయుల డబ్బుతోనే అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలు, పాఠశాలలు ఏర్పాటు చేసి సేవ చేస్తున్నట్లు నటిస్తారు. విదేశీయులు తమ పేరుపై భారత దేశంలో ఆస్తులు కొనే అవకాశం లేకపోవడంతో ఈమోసగాళ్ల పేరుపైన ఆస్తులు, స్థలాలు రిజిస్ట్రేషన్ చేయిస్తారు. కొన్నేళ్లపాటు ఈతతంగా సాఫీగా సాగుతుంది. తరువాత ఈఆస్తులు తమ సొంత ఆస్తులుగా ప్రకటించుకుని, విదేశీయులను మోసం చేస్తారు. మరికొంతమంది విదేశీయులకు బినామీలుగా ఉంటామంటూ వారితో పెట్టుబడి పెట్టించి పొలాలు, భూములు,స్థళాలు కొనుగోలు చేయిస్తారు. అవి తమ పేరుపై రిజిస్టేషన్ చేయించుకుంటున్న తరువాత అసలు బుద్ధి చూపిస్తారు. తాము సొంతంగా ఈఆస్తులు కొనుగోలు చేసినట్లు అడ్డం తిరిగి విదేశీలను నిలువునా మోసం చేస్తారు. కొంతమంది మోసగాళ్లకు చదువురాకపోయినా, వివిధ భాషల్లో పట్టు ఉండటంతో వారి పనులు సాఫీగా సాగిపోతున్నాయి. విదేశీయులను మోసం చేసి ఆస్తులు కూడపెట్టుకున్నవారిలో పుట్టపర్తికి చెందిన పలువురు రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు, లాయర్లు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు కూడా ఉండటం గమనార్హం.

కేసుపెడితే పోలీసులకు పండగే..!

పుట్టపర్తిలో మోసగాళ్ల బారిన పడి సర్వం పోగొట్టుకున్న విదేశీయులు, ఎన్ఆర్ఐలు పోలీసులను ఆశ్రయిస్తే పోలీసులకు పండగ వచ్చినట్లే. బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకున్న మరుక్షణం నుంచే పోలీసులు హడావుడి చేస్తూ మోసగాళ్ల అంతు చూస్తామని బిల్డప్పులిస్తారు. వారిని నమ్మి, బాధితులు తమ బలహీనతలను కూడా వారికి చెప్పుకుంటారు. ఇదే అదునుగా పోలీసులు మీకు న్యాయం చేస్తాం, ఆస్తులు, తిరిగి ఇప్పిస్తామంటూ వారి నుంచి పెద్ద మొత్తంలో సొమ్ము వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. తరువాత మోసగాళ్లను పోలీసులు పట్టుకుని తమ దారికి వచ్చేవరకు వేచి చూస్తారు. మోసగాళ్లతో ఒప్పందం కుదిరిన తరువాత వారి నుంచి కూడా పెద్ద మొత్తంలో సొమ్ము వసూలు చేస్తారు. ఆతరువాత ఇది సివిల్ వ్యవహార మని, కోర్టులో తెల్చుకోవాలని బాధితులకు చెప్పి చేతులు దులుపు కుంటారు. అవసరమైతే తూతూ మంత్రంగా కేసులు పెట్టి వదిలేస్తారు. గత కొన్నేళ్లుగా ఈవ్యవహారం పుట్టపర్తిలో సర్వసాధారణంగా జరుగుతోంది.

మచ్చుకు కొన్ని పరిశీలిస్తే..

- అమెరికాలో నివసిస్తున్న చెన్నైకి చెందిన ఓ ఎన్ఆర్ఐ పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సమీపంలో ఐదున్నర ఎకరాల భూమి కొనుగోలు చేశాడు. ఎన్ఆర్ఐకి సంతానం లేకపోయినా, ఆయన కుమారుడే భూమిని తమకు రిజిస్ట్రేషన్ చేయించినట్లు కొంతమంది నకిలీ పత్రాలు సృష్టించి ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈమోసంపై ఆ ఎన్ఆర్ఐ పుట్టపర్తి పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఇరువర్గాల నుంచి భారీ మొత్తంలో డబ్బు వసూలు చేసి, కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు.
- పుట్టపర్తి విమానాశ్రయం, కమ్మవారిపల్లి గ్రామాల మధ్యలోని వై.జక్షన్ వద్ద 16 ఎకరాలను ఓ ఆయుర్వే వైద్యుడు ట్రస్టు పేరుతో కొనుగోలు చేసినట్లు విదేశీయులను నమ్మించి, తన పేరుపైన రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. దీనిపై 15 సంవత్సరాల క్రితం పుట్టపర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అయినప్పటికి ఈభూమిని పలువురు రిజిస్ట్రేషన్ చేయించుకుని ప్లాట్లు వేసి విక్రయించారు.
- పుట్టపర్తి గణేష్ సర్కిల్ సమీపంలో ఇటలీ మహిళను మోసగించి, రూ. ఐదుకోట్ల విలువ చేసే ఓ భవనాన్ని పుట్టపర్తికి చెందిన ఓ వ్యక్తి తన పేరుపై రాయించుకున్నాడు.
- కర్నాటక నాగేపల్లి సమీపంలోని ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలను కబ్జా చేయడానికి కొంతమంది రాజకీయ నాయకులు విశ్వ ప్రయత్నం చేశారు. ఈపాఠశాలకు నిధులు సమకూర్చిన విదేశీ మహిళ, తీవ్రంగా ప్రతిఘటించడంతో కబ్జా విషయం తాత్కాలికంగా నిలిచిపోయింది.
- పుట్టపర్తి వివేకానంద రోడ్డులో కోల్‌కతాకు చెందిన ఓ ఎన్ఆర్ఐ మహిళ 20 సంవత్సరాల కిందట ప్లాట్లు కొనుగోలు చేశారు. అయితే ఆమె చనిపోయినట్లు కోల్‌కతా కార్పొరేషన్‌లో నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం సృష్టించి పుట్టపర్తికి చెందిన ఓవ్యక్తి తనపేరుపై ఆ పాట్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. కొద్దిరోజుల తరువాత విషయం తెలుసుకున్న ఆ ఎన్ఆర్ఐ పుట్టపర్తికి వచ్చి ఆవ్యక్తిని నిలదీయగా, రిజిస్ట్రేషన్ రద్దు చేసుకుని, పలాయనం చిత్తగించాడు.
- జగరాజుపల్లిలో ఓ ప్రముఖ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పలు విద్యాసంస్థలు, విదేశీ నిధులతోనే ఏర్పాటు అయ్యాయి. రూ.కోట్లాది ఆస్తులు ఈస్వచ్ఛంద సంస్థ పేరుపై ఉన్నాయి. వీటిని స్వాహా చేయడానికి కూడా అనేకమంది ప్రయత్నాలు చేస్తున్నారు.

తీరనున్న బెంగ..!

అనంతపురం న్యూటౌన్/గుంతకల్లు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు జిల్లావాసుల కల నెరవేరింది. అనంతపురం మీదుగా ఎన్నో రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఏ ఒక్కటీ అనంతపురం నుంచి మొదలవదు. దీంతో రైలు ప్రయాణికులు ముందుగానే స్టేషన్‌కు చేరుకుని, నిరీక్షించి, బండి రాగానే పరుగెత్తుకుంటూ ఎక్కేవారు. అనంతపురం నుంచే రైలు మొదలైతే బాగుండేదని జిల్లావాసులు కోరుకునేవారు. ఎట్టకేలకు అనంతవాసుల కల నెరవేరింది. అనంతపురం నుంచి ఓ రైలు బండి బయల్దేరనుంది. అనంతపురం, బెంగళూరు మధ్య నడిచే మెయిల్‌లైన్ ఎలెక్ట్రికల్ మల్టిపుల్ యూనిట్ (మెము) రైలును ఈనెల 4వ తేదీన మధ్యాహ్నం 1.30 గంటకు ప్రారంభించనున్నారు. పుట్టపర్తి, బెంగళూరు మధ్య నడిచే ఈ రైలును అనంతపురం వరకు పొడిగించారు. ఈ రైలును అనంతపురం నుంచి ప్రారంభించాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తీవ్ర పోరాటం చేశారు. పలుమార్లు రైల్వే మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పోరాట ఫలితంగా రైలును అనంత నుంచి ప్రారంభించేలా రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. దీంతో నగరం నుంచి మొదలయ్యే మొట్టమొదటి రైలుగా ఇది నిలువనుంది. అనంతపురం నుంచి బెంగళూరు వెళ్లాలనుకునే రైలు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఉదయం పూట అవి కూడా ఎక్స్‌ప్రెస్ రైళ్లే ఉన్నాయి. వాటిలో జనరల్ బోగీలు తక్కువ. మధ్యాహ్న సమయంలో అవి కూడా లేవు. దీంతో ఇబ్బందులు పడేవారు. మధ్యాహ్న సమయంలో అది కూడా మెము రైలు బయల్దేరనుండడం ఎంతో ప్రయోజనకరమని జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మధ్యాహ్నం నుంచి..

అనంతపురం, బెంగళూరు మధ్య నడిచే (66560) మెము రైలును అనంత రైల్వేస్టేషన్‌లో ఈనెల 4న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ లాంఛనంగా ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 1.30 గంటకి జెండా ఊపి ప్రారంభిస్తారు. షెడ్యూల్‌కు అనుగుణంగా 2.10 గంటకు రైలు బయల్దేరుతుంది. ధర్మవరం, పుట్టపర్తి, హిందూపురం మీదుగా రాత్రి 7.50 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం.66559) బెంగళూరులో ఉదయం 8.35 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 1.55కి అనంతపురం చేరుకుంటుంది.



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

బలవంతపు భూసేకరణను ప్రతిఘటిస్తాం : ఏపీ రైతు సంఘం

పెనుకొండ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): బలవంతపు భూసేకరణను ప్రతిఘటిస్తామని ఏపీ రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి అధ్యక్షతన హిందూపురం, లేపాక్షి, పరిగి పరిధిలోని చలివెందుల, రాచపల్లి, మలుగూరు, మీనకుంటపల్లి, కొండూరు, వడ్డిపల్లి, తిమ్మగానిపల్లి గ్రామాలకు చెందిన రైతులు బలవంతపు భూసేకరణ ఆపాలంటూ పెనుకొండలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఉదయం స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేపట్టారు. ఈ ఆందోళనలో పాల్గొన్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో ముందస్తు సమాచారం లేకుండా, గ్రామసభలు నిర్వహించకుండా 80శాతం మంది రైతుల ఆమోదం లేకుండా బలవంతపు భూసేకరణ చేయడం అన్యాయమన్నారు. పరిగి, హిందూపురం ప్రాంతాల్లో పరిశ్రమల పేరుతో భూములు సేకరించి ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి దశాబ్దాలు గడుస్తున్నా వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ పైగ్రామాల్లో 1118మంది రైతుల నుంచి 2191ఎకరాల భూమిని దేనికోసం సేకరిస్తున్నారో చెప్పకుండా, గ్రామసభల్లో వివరించకుండా బలవంతంగా లాక్కోవడం దారుణమన్నారు. బలవంతపు భూసేకరణలు ఆపాలని లేనిపక్షంలో రైతులతో కలిసి పోరాటాలకు సన్నద్ధం కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు అందించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు సిద్దారెడ్డి, ఫకృద్దీన్, వేమారెడ్డి, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

బహుగ్రంథ రచయిత రమేష్ నారాయణ

పుస్తకావిష్కరణ సభలో ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం కల్చరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): విభిన్న అంశాలపై ప్రతిభావంతమైన రచనలు చేసిన విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పతికి రమేష్‌నారాయణ బహుగ్రంథ రచయిత అని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. విద్యావేత్త, రచయిత రమేష్‌నారాయణ రచించిన 'మహ్మద్ రసూల్ వారి జీవిత చరిత్ర' పుస్తకాన్ని సోమవారం అశోకనగర్‌లోని రహీమ్ ఖాద్రీ మసీదు ఆవరణలో ఎమ్మెల్యే దగ్గుపాటి, ముతవల్లిల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎం షకీల్ షఫిల చేతుల మీదుగా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్య, సాహిత్యం, సామాజిక, సాంస్కృతిక, చారిత్రక రంగాలపై రమేష్ నారాయణకు లోతైన అవగాహన ఉందన్నారు. 75 సంవత్సరాల వయసులోనూ నిత్యచైతన్యశీలిగా సామాజిక బాధ్యతను నెరవేరుస్తుండడం స్ఫూర్తిదాయకమన్నారు. సాయిబాబా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సుదీర్ఘ సేవలందించారని గుర్తుచేశారు. వైజ్ఞానిక సామాజిక శాస్త్రాలు, సాహిత్య విమర్శ తాత్విక, జానపద గ్రంథాలు, ఆధునిక తెలుగుకావ్యాలు, అనేక ఆంగ్ల అనువాదాలు, పాపులర్ సైన్స్ వ్యాసాలు, ఆకాశవాణి ప్రసంగాలు, అనంత జానపదగేయాల ఆంగ్లవాదం వంటి రచనలు రమేష్‌నారాయణ ప్రతిభకు నిదర్శనాలని కొనియాడాన్నారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు మాజీ సభ్యుడు కేఎం షఫీవుల్లా, పలువురు ముతవల్లిలు పాల్గొన్నారు.




'మహ్మద్ రసూల్ వారి జీవిత చరిత్ర' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి తదితరులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంత్...

డాక్టర్ ఎం.కరుణానిధి (జయంతి)




తమిళనాడు రాష్ట్రానికి ఐదుసార్లు ముఖ్యమంత్రిగా గెలుపొంది సుదీర్ఘకాలం సేవలందించిన ఘనత, కలైజ్ఞర్‌గా పేరొందిన డాక్టర్ ముత్తువేల్ కరుణానిధి 1924 జూన్ 3న జన్మించారు. ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకే) పార్టీ అధ్యక్షుడు, సంస్థాపక సభ్యుడు. 60 ఏళ్ల రాజకీయాల్లో పోటీ చేసిన ప్రతి ఎన్నికల్లో గెలుపొంది రికార్డు సృష్టించారు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడులోని అన్ని లోక్‌సభ స్థానాల్లో యూపీఏ గెలిపించడంలో కీలకపాత్ర పోషించారు. రాజకీయాల్లోకి రాకముందు తమిళ సినీ రంగంలో స్క్రీన్‌రైటర్‌గా రాణించారు. తమిళ సాహిత్యంలో గొప్ప సేవలందించారు. ద్రవిడ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. గౌరవ డాక్టరేట్‌లు అందుకున్నారు. 2018 ఆగస్టు 7న కన్నుమూశారు.

శంకర కురుప్ (జయంతి)



పద్మభూషణ్ గ్రహీత జీ శంకర కురుప్ 1901 జూన్ 3న జన్మించారు. మళయాళ సాహిత్యంలో ఆయన మహాకవిగా పేరొందారు. కవి, రచయిత, సాహితీవేత్తగా రాణించారు. తొలి జ్ఞానపీఠ పురస్కార గ్రహీత ఆయనే. 40కు పైగా పుస్తకాలు, 250 కవితలు ప్రచురితమయ్యాయి. చిన్నకథలు, నాటకాలు, వ్యాసాలు ఉన్నాయి. రవీంద్రనాథ్ రచించిన 'గీతాంజలి'ని మళయాళంలోకి అనువాదం చేశారు. సాహిత్య అకాడమీ అవార్డు, కేరళ సాహిత్య అకాడమీ అవార్డు, సోవియెట్ ల్యాండ్ నెహ్రూ అవార్డు అందుకున్నారు. 1968 నుంచి 1972 వరకు రాజ్యసభ సభ్యుడిగా వ్యవహరించారు. 1978 ఫిబ్రవరి 2న కన్నుమూశారు.

వేదాంతం రామలింగశాస్త్రి (పుట్టినరోజు)



వేదాంతం రామలిగశాస్త్రి 1963 జూన్ 3న కృష్ణా జిల్లా మొవ్వ మండలం కూచిపూడిలో జన్మించారు. కూచిపూడి నృత్య కళాకారుడిగా, నృత్య దర్శకుడిగా, రచయితగా, నాట్యాచారుడిగా, నటుడిగా, పరిశోధకుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలి. సిద్దేంద్రయోగి కూచిపూడి కళాపీఠంలో ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. 2008లో 300మంది డ్యాన్సర్లతో ఏర్పాటైన నృత్య ప్రదర్శనకు గిన్నిస్‌బుక్ రికార్డు సాధించారు. 2022 డిసెంబరులో కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యుడిగా ఎంపికయ్యారు. నాట్యరత్న, నాట్య స్రామాట్, సంగీత నాటక అకాడమీ పురస్కారాలు అందుకున్నారు.

రాఫెల్ నడాల్ (పుట్టినరోజు)



స్పానిష్ దేశ టెన్నిస్ క్రీడాకారుడు రాఫెల్ నడాల్ 1986 జూన్ 3న జన్మించారు. ఎడమచేతి వాటం కలిగిన వ్యక్తి. ఏటీపీ ర్యాంకింగ్స్‌లో 209 వారాలపాటు నెంబరు 1 ర్యాంకులో కొనసాగారు. 22 గ్రాండ్‌స్లామ్ మెన్స్ సింగిల్స్ టైటిల్స్ అందుకున్నారు. వీటిలో 14 ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్స్ కూడా ఉన్నాయి. స్పెయిన్ డేవిస్ కప్ టీమ్ ఐదుసార్లు గెలుపొందారు. 2022లో టైమ్ మ్యాగజైన్ టాప్ 100 ప్రభావిత వ్యక్తులలో ఒకరిగా నిలిచారు. సొంతప్రాంతం మల్లోర్కాలో టెన్నిస్ అకాడమీని ఏర్పాటు చేయడంతోపాటు సమాజసేవలోనూ రాణిస్తున్నారు.

అందరి చూపూ రాయల్ వైపు..!

» రాష్ట్రంలో క్రికెట్ మేనియా - జోరుగా బెట్టింగ్

బెంగళూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ క్రికెట్ ఫైనల్స్‌లో సుదీర్ఘకాలం తర్వాత రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) తలపడనుండడంతో రాష్ట్రమంతటా భారీ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మంగళవారం ఫైనల్స్ పోటీలు జరగనున్నాయి. ఇందుకోసం బెంగళూరు నగరవ్యాప్తంగా దాదాపు వంద హోటళ్లలో భారీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. 50కుపైగా క్లబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్‌లలోనూ ఏర్పాట్లు చేస్తున్నారు. రాజాజినగర్ ఓరియన్‌మాల్‌లో భారీ స్క్రీన్ ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు ప్రకటించారు. క్రికెట్ అభిమానులకోసం ఇప్పటికే పలు సంఘాలు రాత్రి మ్యాచ్ ముగిసేదాకా ప్రత్యేక ప్రదర్శనలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక రాష్ట్రంలోని ప్రధాన నగరాలైన మైసూరు, మంగళూరు, కొడగుతోపాటు వివిధ ప్రాంతాలలో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. రిసార్టులు, స్టేంహోంలలో లైవ్ వీక్షించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 'ఈసల కప్ నమ్దే' రీల్స్ హల్ చేస్తున్నారు. సాధారణంగా ఐపీఎల్ జరిగిన ప్రతిసారి ఈసల కప్ నమ్దే అంటూ ఆర్‌సీబీ అభిమానులు నినాదాలు చేస్తుంటారు. 18వ విడత ఐపీఎల్ కావడం, ఆర్‌సీబీ అభిమానులు విరాట్‌కొహ్లి 18 టీ షర్ట్ ధించిన విషయం విదితమే. ఆర్‌సీబీలోని ఇతర క్రీడాకారులు ఒక ఎత్తు అయితే విరాట్‌కొహ్లి ఒక ప్రత్యేకత. ఇటీవల టెస్ట్‌మ్యాచ్‌కు విరాట్‌కొహ్లి గుడ్‌బై చెప్పడంతో తెల్ల రంగు టీ షర్ట్‌తో అభిమానులు చిన్నస్వామి స్టేడియంకు వచ్చిన విషయం తెలిసిందే. వారి ఆశలు నిరాశ అయ్యేలా భారీ వర్షం కురిసింది. ఈసారి ఫైనల్స్‌లో జట్టు గెలిచేందుకు ప్రత్యేక పూజలు చేయదలిచారు. మంగళవారం రాత్రి 7.30 నుంచి రాష్ట్రమంతటా క్రికెట్ మేనియా కొనసాగనుంది. మరోవైపు ఆర్‌సీబీ టాస్ గెలుస్తుందా? ఎన్ని పరుగులు చేయనుంది? విరాట్ ఎన్ని పరుగులు చేస్తాడనే అంశాలపై భారీగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. ఫైనల్స్ మ్యాచ్ కన్నడ క్రికెట్ అభిమానులకు ఓ పండుగలాంటిది. జట్టు విజయం సాధిస్తే సంబరాలు మిన్నంటనున్నాయి. ప్రెస్‌క్లబ్‌లోనూ వీక్షణకు ఏర్పాట్లు చేశారు. ప్రతి చోటా గుడ్‌లక్ ఆర్‌సీబీ అంటూ ప్లకార్డులు, హోర్డింగ్‌లు ప్రదర్శిస్తున్నారు. క్రికెట్ అభిమానులంతా వాట్సప్ స్టేటస్ పెట్టుకుంటున్నారు.

జేఈఈ అడ్వాన్స్‌లో ర్యాంకుల పంట

» 17 మంది అలెన్ విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు



అలెన్‌లో విద్యార్థులకు సన్మానం

బెంగళూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్ పరీక్షల ఫలితాలలో నగరానికి చెందిన విద్యార్థులు ర్యాంకులు సాధించారు. అలెన్‌కు చెందిన 17మంది విద్యార్థులు జాతీయస్థాయిలో 500లోపు ర్యాంకులను సాధించారు. అలెన్ సౌత్‌ఇండియా హెడ్ మహేశ్‌యాదవ్ సోమవారం మీడియాకు వివరాలు తెలిపారు. అలెన్ బెంగళూరు శాఖలో చిన్మయ శంకరశాస్త్రి 57వ ర్యాంకు, అనిరుద్ శర్మ 142వ ర్యాంకు, రిషబ్‌పాండే 143, సంకర్షణ్ బహద్దూర్ రఘుబన్షి 164వ ర్యాంకు, శౌర్యరథి 171వ ర్యాంకు, రాఘవ్‌జగ్గి 181వ ర్యాంకు సాధించినట్టు ప్రకటించారు. అలెన్‌లో నిరంతర సాధన, విద్యార్థులకు మార్గదర్శకాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. జాతీయస్థాయిలో 200లోపు ఆరుగురు ర్యాంకులు సాధించగా 500లోపు 17మంది ర్యాంకులు సాధించడం సంతోషంగా ఉందన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల ద్వారా బోధనలు కొనసాగుతాయన్నారు. అలెన్ కెరీర్ ఇన్‌స్టిట్యూట్ బెంగళూరు విద్యా ప్రాధాన్యత కోసం కొత్త మార్గదర్శకాలను కొనసాగిస్తోందన్నారు. విద్యార్థులు అత్యున్నత ప్రతిభను సాధింపచేయడమే లక్ష్యంగా బోధనలు కొనసాగిస్తున్నామన్నారు.

ఆకాశ్‌లో ఐదుగురికి ఉత్తమ ర్యాంకులు

బెంగళూరు ఆకాశ్ ఎడ్యుకేషనల్ సంస్థలో ఐదుగురు విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు వచ్చినట్టు ప్రకటించారు. ఆకాశ్‌దీప్‌కు 99వ ర్యాంకు, అనికేత్ జైన్ 486వ ర్యాంకు, అనిల్‌శాస్త్రి 1478వ ర్యాంకు, చిరాగ్ బిహెచ్ 1521, రయాన్ క్రిస్ దయాస్ 2839వ ర్యాంకులు సాధించినట్టు సంస్థ అకాడమిక్ ఛైర్మన్ ధీరజ్ మిశ్రా తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా సత్కరించారు. ఉన్నతవిద్య పోటీ పరీక్షల్లో సత్తా చాటుకునేలా చక్కటి తర్ఫీదు ఇస్తున్నామన్నారు.



ఆకాశ్‌లో విద్యార్థులకు అభినందన

డ్రైవర్ల రక్షణకు చట్టాలు చేయండి



ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆటో డ్రైవర్ల నిరసన

బెంగళూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవలందిస్తున్న ఆటో డ్రైవర్లకు రక్షణ కరువైందని ఈనేపథ్యంలో రవాణా రంగంపై ఆధారపడిన డ్రైవర్ల రక్షణకు తగిన చట్టాలు కల్పించాలని డ్రైవర్ల సంఘాల సమాఖ్య డిమాండ్ చేసింది. నగరంలోని ఫ్రీడంపార్కులో సోమవారం నిరసన చేపట్టారు. సమాఖ్య పదాధికారులు మాట్లాడుతూ నగరంలో అన్ని వాహనాలు సుమారు 1.5 కోట్లు ఉన్నాయన్నారు. వాహనరద్దీ పెరిగిందన్నారు. రోజుకు 12-15 గంటలసేపు పనిచేయాల్సి ఉందన్నారు. దీంతో డ్రైవర్లపై ఒత్తిడి పెరిగి సహనం కోల్పోయే పరిస్థితి నెలకొందన్నారు. ఒక్కోసారి మూత్ర విసర్జనకు వెళ్లే అవకాశం ఉండదని, సమయానికి భోజనం చేసే వీలుండదన్నారు. ఎటు చూసినా నో పార్కింగ్ బోర్డులతో ఇబ్బందులు ఉన్నాయన్నారు. ఇటీవల బెళ్లందూరు పరిధిలో ఒక ఆటో డ్రైవర్‌పై బిహార్ మహిళ చెప్పుతో దాడి చేసిందన్నారు. సదరు ఆటో డ్రైవర్‌కు తగిన పరిహారం ఇచ్చి రక్షణ కల్పించాలన్నారు. సమస్య ఉంటే సావధానంగా పరిష్కరించుకోవాలన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలు జారీ చేయాలన్నారు. పెద్దసంఖ్యలో వివిధ సంఘాలు ఆటో డ్రైవర్‌లు ధర్నాలో పాల్గొన్నారు.

సర్జాపుర గ్రామపంచాయతీ అధ్యక్షురాలిగా కళావతి

దొమ్మసంద్ర, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని సర్జాపుర గ్రామ పంచాయతీ నూతన అధ్యక్షురాలిగా డాక్టర్ ఎన్ కళావతి మూర్తికుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. తొలుత సర్జాపుర క్రీడామైదానంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన అనంతరం కార్యాలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా బగర్‌హుకుం సాగు క్రమబద్ధీకరణ సమితి సభ్యుడు కూగురు బసవరాజు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాలనీ ప్రముఖులు, సర్జాపుర గ్రామపంచాయతీ పీడీఓ శుభాన్‌ఖాన్, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్ మంజునాథ్ సర్జా, కాంగ్రెస్ నాయకులు శంభయ్య, ఎం శ్రీనివాస్, సభ్యులు నవీన్‌కుమార్, సతీశ్‌కుమార్, ఓంశక్తి మంజునాథ్, భరత్, మమతా రమేశ్, వీణా లలితమ్మ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



కళావతి మూర్తికుమార్‌ను అభినందిస్తున్న ప్రముఖులు

ప్లాస్టిక్ కవర్లు వాడొద్దు

బెంగళూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి నష్టం కలిగించే ప్లాస్టిక్ కవర్లు వాడరాదని అదమ్య చేతన సంస్థ ముఖ్యులు తేజస్విని అనంతకుమార్ వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. లాల్‌బాగ్‌లో సాగుతున్న మామిడిమేళాలో పండ్లు కొనుగోలు చేసేందుకు వచ్చేవారు ప్లాస్టిక్ కవర్లు వాడుతున్నారు. కాలుష్యం నివారించాలని పాత చీరలతో తయారు చేసిన చేతి సంచులను అందుబాటులోకి తెచ్చారు. కుట్టుకూలి ఖర్చుగా ఒక బ్యాగుకు రూ.10 వసూలు చేస్తున్నారు. తేజస్విని అనంతకుమార్‌తోపాటు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



వస్త్ర సంచులతో తేజస్విని అనంతకుమార్ తదితరులు

వాహనాల చార్జింగ్ సెంటర్ ప్రారంభం

దేవనహళ్ళి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద బెస్కాం ఆధ్వర్యంలో నిర్మించి విద్యుత్ వాహనాల చార్జింగ్ సెంటర్‌ను విద్యుత్‌శాఖ మంత్రి కేజే జార్జ్, రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ లాంఛనంగా ప్రారంభించారు. మంత్రి జార్జ్ మాట్లాడుతూ సెకండ్‌లైఫ్ బ్యాటరీల ద్వారా సౌరశక్తితో ఈవీ చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడం విశేషమన్నారు. ఒకేసారి 23 ఎలక్ట్రిక్ వాహనాలను చార్జింగ్ చేయవచ్చునన్నారు. సోమవారం ఏర్పాటైన కార్యక్రమంలో దొడ్డజాల పం చాయతీ అధ్యక్షుడు ఆర్ బైరేగౌడ, బెస్కాం సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



రీచార్జింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి జార్జ్

ప్రతిభా పురస్కారాల ప్రదానం



పురస్కారాలతో విద్యార్థులు

శిడ్లఘట్ట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎల్‌సీ, ద్వితీయ పీయూసీలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు ప్రదానం చేశారు. హండిగనాళ గ్రామంలోని కేవీ భవన్‌లో 11వ వార్షికోత్సవంలో కెంపణ్ణస్వామి వీరణ్ణస్వామి దేవాలయ ట్రస్టు ఆధ్వర్యంలో 82మంది విద్యార్థులను సత్కరించారు. ఆదిచుంచనగిరి మఠం చిక్కబళ్ళాపుర శాఖ మంగళనాథస్వామిజీ మాట్లాడుతూ కన్నవారిని, పెద్దలను గురువులను గౌరవించి సంస్కారవంతులుగా ఉండాలన్నారు. ప్రతిభా పురస్కారాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యతో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ కుశల్‌చౌక్సి, ట్రస్టు అధ్యక్షుడు నాగరాజ్, ఉపాధ్యక్షుడు బిళిశివాలె రవి, కార్యదర్శి అశ్వత్థయ్య, కోశాధికారి మునిస్వామిగౌడ, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

విత్తన వేరుశనగ పంపిణీకి సర్వం సిద్ధం

చిలమత్తూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసే రైతులకు రాయితీ ధరతో విత్తన కాయలను అందించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. సోమవారం మండలంలోని పలు రైతు సేవా కేంద్రాలకు విత్తన వేరుశనగ కాయలు చేరుకున్నాయి. చిలమత్తూరు 1, 2, 3తోపాటు కోడూరు-2, చాగలేరు, మొరసలపల్లి కేంద్రాలకు విత్తనకాయలు చేరాయి. ఒక్కో రైతు సేవాకేంద్రానికి వంద క్వింటాళ్ల కాయలు మొదటి విడతగా వచ్చినట్లు మండల వ్యవసాయాధికారి వంశీకృష్ణ తెలిపారు. 30 కిలోల విత్తనకాయల బస్తా రాయితీపోను రూ.1,674 చెల్లించాలన్నారు.

అగళి: విత్తన వేరుశనగ కావాల్సిన రైతులు పేర్లను రైతు సేవా కేంద్రాల్లో సోమవారం నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ఏఓ శేఖర్‌నాయక్ తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు సత్యసాయిజిల్లాకు 63,918 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయలు ప్రభుత్వం కేటాయించిందన్నారు. కె-6, సిజిఎస్-1694 రకం విత్తన వేరుశనగ 30కేజీల బస్తా పూర్తి ధర రూ.2790కాగా.. 40శాతం సబ్సిడీపోను రైతు వాటాగా రూ.1674 చెల్లించాలన్నారు. కదిరి, లేపాక్షి రకం 30కేజీల బస్తా పూర్తీ ధర రూ.2460కాగా రూ.1476చెల్లించాల్సి ఉంటుందన్నారు. లేపాక్షి: ఖరీఫ్‌లో వేరుశనగ సాగుచేసే రైతులు సబ్సిడీ విత్తనకాయల కోసం తమ పేర్లను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని మండలవ్యవసాయాధికారి శ్రీలత సూచించారు. సోమవారం వ్యవసాయ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో రాయితీ వేరుశనగ సిద్ధంగా ఉందన్నారు.

రొళ్ల: ప్రభుత్వం సబ్సిడీతో పంపిణీ చేసే విత్తన వేరుశనగ కావాల్సిన రైతులు తమ పేర్లు నమోదుచేసుకోవాలని ఏఓ రాజ్యలక్ష్మీ తెలిపారు. మీ సమీపంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో పేర్లను నమోదుచేసుకుని సబ్సిడీ వేరుశనగను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పాలనా విధానాలలో సంస్కరణలతో వికసిత భారత్



ప్రసంగిస్తున్న సంజీవ్‌సన్యాల్

బెంగళూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పాలనా విధానాలలో సంస్కరణల ద్వారా వికసిత భారత్‌కు మార్గదర్శకం కానుందని ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి సభ్యులు సంజీవ్‌సన్యాల్ అభిప్రాయపడ్డారు. చాణక్య యూనివర్సిటీ యువపథలో సోమవారం సాయంత్రం ప్రత్యేక సభ జరిగింది. సంజీవ్‌సన్యాల్ మాట్లాడుతూ 21వ శతాబ్దంలో సవాళ్లను ఎదుర్కొనేందుకు భారత పాలన, సంస్థాగత రచనలకు దిశానిర్దేశం చేస్తాయన్నారు. పబ్లిక్ పాలసీ, ఆర్థిక తంత్రాలు, సంస్థాగత సంస్కరణల ద్వారా దేశంలో భారీ అభివృద్ధికి శక్తివంతమైన విధానాలు సాధ్యం కానున్నాయన్నారు. దేశంలో ఇప్పటికే ఆర్థిక వ్యవస్థ, డిజిటల్ పరివర్తన రంగాలలో సాధన దిశగా వెళుతోందన్నారు. పాలన వివిధ దశలలో లోతైన సంస్కరణలు అవసరం ఉందన్నారు.

విద్యతోపాటు జీవిత పాఠాలు



తరగతులు ప్రారంభంలో బ్యాగు, యూనిఫాం పంపిణీ

బాగేపల్లి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): సాధారణంగా ప్రతి విద్యార్థికి పదో తరగతి కీలకమని, అదే విధంగా కళాశాల విద్య వల్ల జీవితపాఠాలు నేర్పుతుందని ప్రభుత్వ కళాశాలలను నిర్లక్ష్యం చేయరాదని ప్రభుత్వ బాలికల పీయూ కళాశాల ప్రిన్సిపాల్ రూపాపై అభిప్రాయపడ్డారు. పట్టణంలోని బాలికల పీయూ కళాశాలలో 2025-26 వార్షిక పీయూ తరగతులను సోమవారం లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. ప్రైవేట్ వ్యామోహంలో తల్లిదండ్రులు దుబారా ఖర్చు చేయరాదని, ప్రభుత్వ కళాశాలల సౌలభ్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ కళాశాలలు గుణాత్మక విద్యను అందిస్తున్నాయని చక్కగా చదివి ప్రయోజకులు కావాలన్నారు. విద్యార్థులకు గులాబీలు అందచేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బ్యాగులు, యూనిఫాం పంపిణీ చేశారు. రిటైర్డు అధికారి నాగరాజ్, అధ్యాపకులు నాగరాజు, నారాయణప్ప శ్రీదేవి, ఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు.

వీసీగా మధుసూదన సాయి బాధ్యతలు



బాధ్యతలు చేపట్టిన మధుసూదనసాయితో ప్రముఖులు

చిక్కబళ్ళాపుర, జూన్ 2(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి యూనివర్సిటీ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్ చాన్స్‌లర్‌గా మధుసూదన సాయి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచానికి సంస్కారవంతమైన పౌరులను రూపొందించడానికి భారతీయ సంస్కృతిని, గురుకుల తరహా విద్యను అందించాలనే లక్ష్యంతో యూనివర్సిటీ ఏర్పాటైందన్నారు. సీనియర్ విద్యావేత్త బీఎన్ నరసింహమూర్తి తొలి వీసీగా నియమితులయ్యారన్నారు. ప్రస్తుతం వారి బాటలోనే కొనసాగి చక్కటి సమాజానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

బొమ్మల మధ్య కాసేపు కునుకు తీశారు..!



ఆనందరావ్ సర్కిల్ ఫ్లై ఓవర్‌కింద గాంధీ సర్కిల్‌లో సర్వాంగ సుందరంగా ఉండాలని వన్యప్రాణులతోపాటు పలు బొమ్మలను అందంగా తీర్చారు. ఈ మార్గంలో ప్రయాణించేవారికి అనుభూతిని కల్పించాలనే ఆలోచనతో ఏర్పాటు చేశారు. బొమ్మల కొలువులాంటి ప్రదేశంలో నిత్యం సేదతీరేవారు ఎందరో కనిపిస్తారు. ఆదివారం కనిపించిన దృశ్యమిది.

- బెంగళూరు, ఆంధ్రజ్యోతి

వ్యక్తి ఆత్మహత్య

పెనుకొండ టౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన పెనుకొండలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు మహ్మద్‌రఫీక్(40) అనే వ్యక్తి బట్టల వ్యాపారం చేసుకుని స్థానిక దర్గాపేటలో నివాసముంటున్నాడు. వ్యాపారంలో వచ్చే డబ్బులతో మద్యం సేవించి భార్య జుగ్నూతో తరచూ గొడవపడేవాడన్నారు. ఇది భరించలేని భార్య పుట్టినిల్లయిన గౌరీబిదనూరుకు వెళ్లిపోయింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన రఫీక్ ఉరివేసుకుని ఆత్మహత్యచేసుకున్నాడు. రఫీక్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదుచేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కొత్త హాస్టల్ వద్దు.. పాతదే ముద్దు..!

- మూడు కి.మీ. దూరంలో హాస్టల్
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్

పావగడ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కొత్త హాస్టల్ కన్నా పాతదే మేలని విద్యార్థులు అంటున్నారు. కళాశాల, పాఠశాలలకు మూడు కిలోమీటర్ల దూరంలో హాస్టల్ ఉండటంతో సమస్యగా మారింది. పాఠశాల లు ప్రారంభమైనా నేటికీ హాస్టల్ ప్రారంభానికి నోచుకోలేదు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న సంక్షేమ వసతి గృహాలకు విముక్తి లభించనుంది. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐదు వసతి గృహాలను రూ.33.5కోట్లుతో నిర్మాణం చేపట్టారు. 807మంది ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ విద్యార్థులకు ఈ గృహాల్లో వసతి లభించనుంది. ఈ వసతి గృహాలు కళాశాలలు, పాఠశాలలకు మూడు కిలోమీటర్ల దూరం ఉండటంతో విద్యార్థులకు సమస్యగా మారింది. పట్టణంలోని తుమకూరు రోడ్డులో కనుమ నరసింహస్వామి ఆలయం ముందు సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం నుంచి ఐదు హాస్టల్లు నిర్మించడానికి 2021-22లో క్రైస్ సంస్థకు అప్పగించారు. నిర్మాణ పనులు పూర్తయినా ముఖ్యమంత్రి సిద్దరామయ్య చేతులమీదుగా ప్రారంభించాలని నిర్ణయించడంతో ఆగిపోయింది. హాస్టల్ పక్కనే వైశ్య కులస్థులకు చెందిన శ్మశానవాటిక ఉండడంతో రాత్రిపూట నిద్రించడానికి విద్యార్థులు భయపడిపోతున్నారు. 2021లో అప్పటి ముఖ్యమంత్రి గోవింద కారజోళ చేతుల మీదుగా భూమి పూజ చేసినప్పుడే హాస్టల్ నిర్మాణం వద్దని ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని విశ్లేషకులు భావిస్తున్నారు. కేవలం కాంట్రాక్టర్లతో కమీషన్ల కోసమే కక్కుర్తిపడి వందలాది మంది విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న పాలకుల నిర్లక్ష్యం, స్వార్థానికి సమాధానం చెప్పాలని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1597.84	1,577.47
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	20,053	411
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	236	25
నీటి నిల్వ (టీఎంసీలు)	18.86	3.36

పెండింగ్ పంచాయతీలకు అధ్యక్షుల జాబితా విడుదల



కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కంప్లి, సిరుగుప్ప, సండూర్ తాలూకాల్లోని వివిధ గ్రామ పంచాయతీల్లో వివిధ కారణాల వల్ల ఖాళీగా ఉన్న స్థానాలకు ఇప్పటికే ఎన్నికలు నిర్వహించామని కొత్తగా ఎన్నికైన సభ్యుల జాబితాను ప్రకటించామని జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవసముద్ర గ్రామం-శరణమ్మ(సామాన్య)ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దవలాపూర్ కరిబసప్ప(సాధారణ) ఏకగ్రీవం, సిరుగుప్ప రావిహాళ్ గ్రామం సువర్ణ(ఎస్సీ)ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సండూర్ మెట్రీ గ్రామం ఉమాదేవి(ఎస్టీ మహిళ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని కలెక్టర్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

బళ్లారి సిటీ,జూన్ 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని రేడియో పార్క్, ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణాసంస్థలో వివిధ వృత్తివిద్యా కోర్సుల్లో ప్రవేశానికి ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. రెండవ రౌండ్ అడ్మినిషన్ ప్రక్రియ జూన్ 12న జరగనుంది. మూడవ రౌండ్ ప్రక్రియ జూన్ 13నుంచి ఆగస్టు 31వరకు జరగనుంది. ఇన్‌స్టిట్యూట్‌ని సందర్శించి దరఖాస్తులను ఆఫ్‌లైన్‌లో అవసరమైన పత్రాలతో జత చేసి అందించాలని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు సమర్పించిన రోజే అభ్యర్థుల పత్రాలను తనిఖీ చేస్తారు. దరఖాస్తు సమయంలో అభ్యర్థులు అందించిన మొబైల్ నంబర్, ఈమెయిల్ చిరునామాను ప్రవేశం పొందిన రోజు నుండి పరీక్ష ముగిసే వరకు మార్చడానికి వీలు లేదు. వివరాలకు రేడియో పార్క్‌లోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థను కానీ, మొబైల్ నెంబర్ 99163 00462 నంబర్‌ను సంప్రదించవచ్చని ప్రిన్సిపాల్ ఒకప్రకటనలో తెలిపారు.

చర్మకారుల కాలనీ తనిఖీ

బళ్లారి సిటీ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చెందిన డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ తోలు పరిశ్రమ అభివృద్ధి(లిడ్కర్) డైరెక్టర్ ముండ్రగి నాగరాజ్ చర్మకారుల కాలనీని సోమవారం పరిశీలించారు. కాలనీలో కార్పొరేషన్ ద్వారా చర్మకారుల కోసం నిర్మిస్తున్న ఇళ్ళు, ఇతర మౌలిక సదుపాయాలను ఆయన పరిశీలించి పనుల నాణ్యతను తనిఖీ చేసి సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం ఆయన చర్మకారుల ఫిర్యాదులను తెలుసుకుని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గృహ నిర్మాణం, రోడ్లు ఇతర ప్రాథమిక సౌకర్యాల పనులను వేగవంతం చేస్తానన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ సభ్యురాలు శిల్ప, మాజీ సభ్యురాలు దివ్యకుమారి, గుజారి బసవరాజ్, ఖలీల్,లిడ్కర్ కార్పొరేషన్ జిల్లా కోఆర్డినేటర్ సంజీవప్ప, నాయకులు నాగలకెరె గోవింద, మురళీ, అరుంధతి సంఘానికి చెందిన తిమ్మప్ప,చౌదరి సీన, దాసరి పురుషోత్తం, మల్లేశ్, శ్రీనివాస్ బండారి, గరజ గోవర్ధన్, స్థానిక నాయకులు పాలచంద్రబాబు, నగరాజ, గోవర్ధన్ పాల్గొన్నారు.



ర్యాలీగా వెళ్తున్న రైతులు



రైతులకు మద్దతు పలుకుతున్న న్యాయవాదులు

కదంతొక్కిన కర్షకులు..!



నిర్మానుష్యంగా మారిన సింధనూరు బస్టాండ్

రాయచూరు/కంప్లి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్, రబీ సీజన్‌లలో పండించిన జొన్నలు కొనుగోలు చేయాలని రైతులు రోడ్డెక్కారు. సోమవారం సింధనూరు బంద్‌కు రైతు సంఘాలు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. గడిచిన నాలుగు రోజులుగా జిల్లాలోని సింధనూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరవధిక ఆందోళన కొనసాగిస్తున్న రైతులు తమ నిరసన గళాన్ని మరింత తీవ్రతరం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు అమీన్ బాషా, డీహెచ్ పూజారి మాట్లాడుతూ రైతులను ఆదుకునే విషయంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పొలాలకు వాడే మందులు క్రిమికీటక మందులు, రసాయనిక మందులు రోజురోజుకి ఆకాశానికి తాకుతున్నాయి. కష్టపడి పండించిన పంటలు మాత్రం ప్రభుత్వం గిట్టుబాటు రేట్లు కల్పించలేక పోతుందని ఆవేదన వ్యక్తం పరిచారు. బంద్ సందర్భంగా ప్రధాన రహదారుల పై భారీ ర్యాలీ నిర్వహించిన వందలాది మంది రైతులు ప్రభుత్వానికి వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. జొన్నల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంపై అన్నదాత ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల పోరాటానికి ప్రజా సంఘాలు, కన్నడపర సంఘాల నాయకులు, వ్యాపారులు, న్యాయవాదులు అండగా నిలిచారు. వారి పోరాటానికి తాము అండగా ఉంటామని సంకేతాలిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన రైతు సంఘం నాయకులు, ప్రభుత్వం ఇప్పటికైనా తన మొండి వైఖరిని వీడి రైతులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. భవిష్యత్తులో జరిగే పోరాటాల్లో జరగకూడని సంఘటనలు ఏవైన జరిగినా అందుకు ప్రభుత్వమే బాధ్యతవహించాల్సి ఉంటుందని రైతు సంఘాల నాయకులు హెచ్చరించారు.

బంద్ సంపూర్ణం

రైతుల పిలుపు మేరకు చేపట్టిన సింధనూరు బంద్ విజయవంతం అయ్యింది. రవాణా సంస్థ బస్సులు రోడ్డుపైకి రాలేదు. ఆస్పత్రులు, మందుల దుకాణాలు సహా నిత్యవసర వస్తువుల సేవలు యథావిధిగా ఉన్నాయి. బంద్ నేపథ్యంలో వేలాది మంది రైతులు అభ్యుదయ సంఘాలు, నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు నగరంలోని ప్రధాన వీధుల్లో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. మొక్కజొన్న కొనుగోలుకు చర్యలు తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా రైతులు నినాదాలు చేశారు. బంద్ నేపథ్యం లో నగరంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రగతిశీల సంఘాలు, బీజేపీ, కాంగ్రెస్, జేడీఎస్, కన్నడ అనుకూల సంఘాలు ఆందోళనకు దిగాయి. బంద్ నేపథ్యంలో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు అవస్థలు పడ్డారు. సింధనూరు యూనిట్‌కు చెందిన బస్సులు డిపోలో బారులుతీరాయి. వివిధ పట్టణాల నుంచి వచ్చిన బస్సులు, బంద్ కారణంగా సింధనూరు లోనే వుండిపోయాయి. కొన్ని వాహనాలు ఎక్కడి నుంచి వచ్చాయో అక్కడికే వెళ్లిపోయాయి. నగరంలోకి వచ్చే వాహనాలను నియంత్రించేందుకు కుష్టగి రోడ్డు, ఏపీఎంసీ, పీడబ్ల్యూడీ క్యాంపు అంబేద్కర్ సర్కిల్, గంగావతి రోడ్డు 40 సబ్ ఛానల్ సమీపంలో బారికేడ్లు నిర్మించారు. గట్టి పోలీసు బందోబస్తు ఈ కార్యక్రమంలో ఈ సందర్భంగా రైతు నాయకులు చన్నన్‌గౌడ, బన్నిగనూరు, బసవంతరాయగౌడ్, విరుపాక్షగౌడ్, దేవేంద్రగౌడ్, బసవరాజు, కంబాలి, చంద్రశేఖర్, రమేష్, హులగయ్య, గంగాధర్ వివిధ గ్రామాల నుండి వచ్చిన రైతన్నలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు బసవరాజు

9లోగా పరిహారం చెల్లించాలి

● భూ స్వాధీన రైతులకు న్యాయం చేయాలి : రైతు సంఘం నాయకులు

బళ్లారి సిటీ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కుడితిని, హరగినడోని, జానెకుంటె, వేణీవీరాపుర, కొళగల్లు, యర్రంగలి, సిద్దమ్మనహళ్ళి గ్రామాల్లో పరిశ్రమల కోసం సేకరించిన వ్యవసాయ భూమికి జిల్లా కోర్టు తీర్పు ప్రకారం పరిహారం తక్షణమే చెల్లించాలని రైతు సంఘం నాయకులు కోరారు. సోమవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ వరకు ప్రభుత్వానికి గడువు విధిస్తున్నామని ఆలోపు నష్ట పరిహారం చెల్లించకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధమన్నారు. సమావేశంలో కర్ణాటక ప్రాంత రైతు సంఘం, సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ భూసంత్రస్త(భూనిరాశితులు) పోరాట సమితి కుడితిని, కన్నడ అనుకూల సంస్థల సంయుక్త కమిటీ తెలిపింది. కమిటీ నాయకులు బసవరాజ్, సత్యబాబు మాట్లాడుతూ బ్రాహ్మిణీ ఫ్యాక్టరీల స్థాపన కోసం 14సంవత్సరాల క్రితం కేఐడీబీ ద్వారా 12.500 ఎకరాల భూమిని సేకరించారన్నారు. ఈ సమయంలో మోసపూరిత భూముల ధరలను నిర్ణయించి రైతులను బలవంతంగా స్వాధీనం చేసుకున్నారు. 898 రోజులుగా నిరసనలు, ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వం దిగి రాలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇచ్చిన హామీ ప్రకారం ఈనెల 9వ తేదీ లోగా తమ సమస్య పరిష్కరిచాలన్నారు.

హాస్టళ్లలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం (హొస్పేట), జూన్ 2(ఆంధ్రజ్యోతి) : 2025-26 సంవత్సరానికి కూడ్లిగి కొత్తూరులో పనిచేస్తున్న వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ పోస్ట్ మెట్రిక్ బాలురు, బాలికల హాస్టళ్లలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. కేటగిరి 1, 2ఏ, 2బి, 3ఏ, 3బి షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన పీయుసీ, పీయుసీ సమాంతర విద్యార్థుల నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానించినట్లు తాలుకా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సంక్షేమ అధికారి తెలిపారు. కూడ్లిగి, కొత్తూరు తాలుకాలోని బాలుర వసతి గృహాలు రూ. లక్ష ఆదాయ పరిమితిలోపు వుండాలి. కేటగిరీ 1, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల తల్లిదండ్రులకు రూ. 2.50 లక్షలు, ఎస్టీ విద్యార్థులకు, ఇతర వెనుకబడిన తరగతులు, ఇతరులు తల్లిదండ్రులకు రూ. లక్ష దరఖాస్తులను వెబ్‌సైట్‌లో సమర్పించాలన్నారు. దరఖాస్తులను జూన్ 20లోపు సమర్పించాలి. తాలుకా వారీగా హాస్టళ్ల వివరాలు, హాస్టల్ ప్రవేశానికి అర్హత ప్రమాణాలు సమర్పించాల్సిన పత్రాల వివరాలు, ప్రభుత్వ ఉత్తర్వుల కోసం, శాఖ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

8 వరకు కులగణన పొడిగింపు

విజయనగరం (హొస్పేట), జూన్ 2(ఆంధ్రజ్యోతి) : సర్వే బ్లాక్‌లో 2025-26 సంవత్సరానికి షెడ్యూల్డ్ కులా సమగ్ర సర్వేను జూన్ 2 నుంచి జూన్ 8 వరకు పొడిగించామని, స్వీయప్రకటనను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశాన్ని ఇచ్చామని సాంఘీక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల సౌకర్యార్థం విజయనగరంలోని సాంఘీక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయిలో, అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా సాంఘీక సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఇప్పటికే ఏర్పాటు చేశామన్నారు. విజయనగరం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా నోడల్ అధికారి, జిల్లా అధికారులు, కేబీ రామచంద్రప్ప 91418274645, విజయనగర్ రమేష్ 8095002829, హొస్పేట నజీమా బాను 9108777499, హగరి బొమ్మనహళ్లి ఆనంద్ 9901980762, కూడ్లిగి షెహాఖా అహ్మదీ 9482608061, హరప్పనహళ్లి గంగప్ప 9739094433 సర్వే గురించి సమాచారం పొందడానికి కంట్రోల్ రూమ్ నోడల్ అధికారులను సంప్రదించాలని వారు తెలిపారు.

దివ్యాంగుల సంరక్షకులకు ప్రోత్సాహకాలు

విజయనగరం (హొస్పేట), జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : 2025-26 సంవత్సరంలో దివ్యాంగులు, పౌరుల సాధికారత శాఖ అర్హులైన అభ్యర్థుల నుంచి రూ. 5 వేల ప్రోత్సాహకాన్ని అందుకోవడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. 75 శాతం కంటే ఎక్కువ వైకల్యం వున్న సెరిబ్రల్ పాల్సీ ఆటిజం, మేధో వైకల్యం, బహుళ వైకల్యాలు ఉన్న వ్యక్తుల సంరక్షకులకు వెయ్యి రూపాయలు అందించనున్నట్లు జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారి రామాంజినేయ తెలిపారు. దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారి కార్యాలయం లేదా సంబంధిత గ్రామ వీఆర్‌డబ్ల్యూ, మున్సిపల్ యుఆర్‌డబ్ల్యూ, తమంగ్ ఎంఆర్‌డబ్ల్యూ కేంద్రాల నుంచి దరఖాస్తులను పొందవచ్చు. నింపిన దరఖాస్తులను జూన్ 3 నుండి 30 వరకు జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

రేపు వరదాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

బళ్లారిరూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ప్రసిద్ధి చెందిన అభయ వరదాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు ధనుంజయ తెలిపారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరాడు. పూజ అనంతరం అందరికీ ప్రసాదం, అన్నప్రసాదం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కన్నడిగులకు కమల్ హాసన్ క్షమాపణ చెప్పాలి



గ్రామలెక్క అధికారికి వినతిపత్రం అందజేస్తున్న వి ఫర్ యూ సంస్థ పదాధికారులు

కంప్లి, జూన్ 2(ఆంధ్రజ్యోతి) : సినీనటుడు కమల్‌హాసన్ తన అహాన్ని వదులుకుని కన్నడిగులకు క్షమాపణ చెప్పాలని వి ఫర్ యు సంస్థ గౌరవ అధ్యక్షుడు హనుమేష్ డిమాండ్ చేశారు. సోమవారం సిరిగేరి గ్రామంలో గ్రామలెక్క అధికారికి శివపుత్రప్ప మనవిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా హనుమేష్ మాట్లాడుతూ కన్నడ భాష తమిళం నుంచి పుట్టిందని నటుడు కమల్ హాసన్ వ్యాఖ్యానించడం విచారకరమన్నారు. విలువైన నాయకులు కన్నడ భాష, నేల నీటి కోసం పోరాడారు. కన్నడిగుల మనోభావాలు దెబ్బతింటే ఎవరూ సహించరు. వెంటనే క్షమాపణ చెప్పాలని హెచ్చెరించారు. అదేవిధంగా విఫర్‌యు సంస్థ అధ్యక్షుడు పునీత్‌కుమార్ మాట్లాడుతూ కన్నడకు ప్రాచీన చరిత్ర వుందన్నారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ఉపాధ్యక్షుడు హళ్లిమార నాగరాజు, ప్రధాన కార్యదర్శి కొల్లి శేఖర్, కోశాధికారి శివాజీరావు, డైరెక్టర్లు ఆలంబాషా, న్యాయవాది రాంబాబు, ఎస్ గాదిలింగ, తిప్పేస్వామి, గుడట్టి హంసప్ప, కల్లుడి పంప, గంగాధర్, పాల్గొన్నారు.

బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోండి : డీఎస్పీ



శాంతిసభ సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్ గోఖలే

కంప్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : రానున్న బక్రీద్ పండుగను కులమతాల విభేదాలు లేకుండా అందరూ ఐక్యతతో పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని డీఎస్పీ ప్రసాద్ గోఖలే తెలిపారు. సోమవారం కంప్లి పోలీస్ స్టేషన్‌లో పోలీసులు ఏర్పాటు చేసిన శాంతిసభ సమావేశంలో పాల్గొని తెలిపారు. సమావేశంలో అన్ని మతాల వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ గోఖలే పండుగ రోజు ఊరేగింపు విషయంలో కానీ సామూహి ప్రార్థన విషయంలో కానీ చెదురుమదులు సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. ప్రార్థనకు వెళ్లే సమయంలో కూడా శబ్దాలు వెలువడే వాహనాలు నడపరాదన్నారు. ప్రతి పండుగను అన్ని కులాల వారు ఐక్యతతో కలిసి పండుగను జరుపుకున్నప్పుడే పట్టణం, గ్రామాలు శాంతిగా వుండి అభివృద్ధి వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పురుషోపద్యక్షులు బట్టా ప్రసాద్, వాసుకుమార్, ఎస్ఐ అవినాష్, కాంబ్లె వివిధ మతాలు ప్రముఖులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

పాఠశాలల పునఃప్రారంభం



బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ దినేశ్ కుమార్

హోసూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ పాఠశాలలు సోమవారం ప్రారంభమయ్యాయి. కలెక్టర్ దినేశ్‌కుమార్ తరగతులు ప్రారంభించి విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేశారు. జిల్లాలో 1740 పాఠశాలల్లో 1నుంచి 12వ తరగతి వరకు 2,03,883 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. ప్రభుత్వ సదుపాయాలు సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పెంపుకోసం స్వచ్ఛంద సంస్థలు, పరిశ్రమలు సహకరించాలని కలెక్టర్ దినేశ్ కుమార్ పిలుపునిచ్చారు.

హోం మంత్రిని కలిసిన మైనార్టీ నాయకులు

రాయచూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : గడచిన రెండు నెలలుగా రాయచూరు నగరంలో జరిగిన వరుస సంఘటనల నేపధ్యంలో జిల్లాకు చెందిన మైనార్టీ నాయకుడు సోమవారం బెంగళూరులో రాష్ట్ర హోం మంత్రి డాక్టర్ జీ పరమేశ్వర్‌ను కలిశారు. మాదకద్రవ్యాల వినియోగం పెరగడం వల్లే యువత చెడు దోవన నడుస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపధ్యంలో అలాంటి వాటి పై నియంత్రణ కఠినంగా ఉండాలంటు జిల్లా మైనార్టీ సంఘం నాయకుడు ఫయాజుద్దీన్ కోరారు. ఇటీవల కాలంలో వరుసగా జరిగిన సంఘటనల్లో నలుగురు యువకులే మృత్యువాత పడ్డారని ఈ అల్లర్ల వెనక ఈ మరణాల వెనక మాదకద్రవ్యాల వినియోగం మూలా ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్న విషయాన్ని హోం మంత్రి దృష్టికి తెచ్చారు. తక్షణం జిల్లా అధికారులకు ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేసి మాదకద్రవ్యాల వినియోగం, వ్యాపారాన్ని అణచివేసేలా ఆదేశాలివ్వాలని కోరారు.

125 యూనిట్ల రక్తం సేకరణ

హోసూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు, టీవీఎస్ మోటార్ కంపెనీ అసోసియేషన్ అధ్యక్షుడు కుప్పుస్వామి పుట్టినరోజు పురస్కరించుకుని కార్మికులు సంబరాలు చేశారు. పలు దేవాలయాలలో పూజలు నిర్వహించి, ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నారులకు, రోగులకు అవసరమైన వస్తువులు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరం ద్వారా 125 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాభిమానాన్ని మరువలేను : ఎమ్మెల్యే



పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ ప్రజల అభిమానాన్ని ఎన్నటికీ మరువలేనని ఎమ్మెల్యే గణేష్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం కంప్లి పట్టణం అంబేడ్కర్ సర్కిల్‌లో మెట్రి వసకోటి జగదీష్ ఆధ్వర్యంలో గణేష్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 60 అడుగుల ఎమ్మెల్యే కటౌట్ ఏర్పాటు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి పిల్లలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెట్రి వసకోటి జగదీష్ మాట్లాడుతూ తమ నాయకుడు ఎమ్మెల్యే గణేష్ మరిన్ని హోదాలు పొంది నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలో కూడా మరిన్ని సేవలు చేపట్టి గుర్తింపు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు బట్టప్రసాద్ మూకయ్యస్వామి, శ్రీనివాసరావు, సీఆర్ హనుమంతు, నారాయణప్ప, షణ్ముఖప్ప, మరిగౌడ, అంజనప్ప కాలింగ, వర్ధన రేణుకగౌడ, సిద్దప్ప, శివంగౌడ, గంగాధర, శంకరప్ప, రాజా సుధీర్ ఉస్మాన్, హబీబుర్ రెహ్మాన్, ఓంకార్, మధు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జన ఔషధి కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

సిరుగుప్ప, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జన ఔషది కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప కోరారు. సిరుగుప్ప తాలుకాలోని కరూరు గ్రామంలో ప్రధానమంత్రి జన ఔషది కేంద్రాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలను ఓర్వలేక రాష్ట్ర ఆరోపణలు చేయడం సరైంది కాదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాలుకా అధ్యక్షుడు మల్లికార్జున స్వామి, జిల్లా ఎస్సీ మోర్చ అధ్యక్షులు మైఖేల్ వీరేష్, చిరంజీవిరెడ్డి, ఈరణ్ణగౌడ కార్యకర్తలు పాల్గొన్నారు.



జన ఔషధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

ఉత్తమ సేవలకు డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న ప్రతిమ రమేష్ శెట్టి

బళ్లారిరూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలో సమాజసేవ, ఉచిత రక్తదానం తదితర కార్యక్రమాలను గుర్తించి హేషా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ పలువురిని అభినందించింది. సంస్థ ఆధ్వర్యంలో డాక్టరేట్‌ను ప్రతిమ రమేష్ శెట్టి అందుకుంది. ఆర్యవైశ్య సమాజ మహిళలకు ఉత్తమ సేవలందించిడంతో ఆమెకు ఈ పురస్కారం అందించారు. పురస్కారం రావడంపై ఆమెను పలువురు ఘనంగా సన్మానించి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెద్దవడుగూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలంలోని ఎన్‌హెచ్-44 గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటకలోని రాయచూరుకు చెందిన క్లీనర్ మహమ్మద్ (31) మరణించాడు. అనంతపురం నుంచి రాయచూరుకు ఐచర్ వాహనంలో డ్రైవర్ ఖలీల్ ఉల్ రెహమాన్, క్లీనర్ మహమ్మద్ బయలుదేరారు. డ్రైవర్ ఖలీల్ నిద్రమత్తులో అతివేగంగా వెళ్తూ ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మహమ్మద్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంజనేయులు తెలిపారు.

బెంగళూరులో తెలుగు మహోత్సవం

హిందూపురం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆశ్రమంలో తెలుగు మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శిక్షకులు వెంకటస్వామి, సత్యనారాయణ తెలిపారు. ఆర్ట్‌ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్ గురూజీ పర్యవేక్షణలో 4 నుంచి 8వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎనిమిదేళ్ల చిన్నారులకు ప్రజ్ఞాయోగ, ఉత్కర్షయోగ, 13ఏళ్ల పైబడినవారికి మేధాయోగ లెవెల్1, 2 ఉంటాయన్నారు. 18ఏళ్ల పైబడిన వారికి హ్యాపినెస్ ప్రోగ్రాం ఆనందమయ శిక్షణ ఉంటాయని తెలిపారు. వీటితోపాటు వేర్వేరు కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది పాల్గొంటారని, హిందూపురం ప్రాంతంలోనివారు కూడా పాల్గొనవచ్చన్నారు.